### ప్రజల పెన్నిధి రాజాబహదూర్
## వెంకట రామరెడ్డి
**నేడు నగర మాజీ కొత్వాల్ జయంతి**



హిమాయత్‌నగర్ : నిజాం కొలువులో ప్రజల పెన్నిధిగా నిలిచిన సేవా తత్పరులు.. విద్యార్థి వసతిగృహం, 22కు పైగా విద్యాసంస్థలను నెలకొల్పిన మహనీయుడు నగర మాజీ కొత్వాల్ రాజాబహదూర్ వెంకట రామరెడ్డి. అమీన్ (ఎస్సై) నుంచి కొత్వాల్ (నగర కమిషనర్)గా ఎదిగి పోలీస్ వ్యవస్థకు మార్గ నిర్దేశకుడిగా నిలిచాడు. వెంకట రామరెడ్డి నగర కొత్వాల్‌గా బాధ్యతలు చేపట్టి 14 ఏండ్లు పనిచేసి భాగ్యనగర చరిత్రలో తనకంటూ ప్రత్యేక ముద్ర వేసుకున్నారు. ఆయన గొప్పతనానికి మెచ్చి బ్రిటిష్ అధికారులు ఆర్డర్ ఆఫ్ బ్రిటిష్ ఎంపైర్ టైటిల్‌తో సన్మానించారు. బాలికల కోసం ప్రత్యేక కళాశాలలు, హాస్టల్స్‌ను ఏర్పాటు చేసిన విద్యాదాత వెంకట రామరెడ్డి , ఇటు నగర పోలీస్ బాస్‌గా అటు విద్యాదాతగా విశేష సేవలందించారు. రాజాబహదూర్ వెంకట రామిరెడ్డి ఎడ్యుకేషన్ సొసైటీ ఆధ్వర్యంలో వెంకట రామరెడ్డి 155వ జయంతి ఉత్సవాలను నేడు (గురువారం) ఉదయం 10 గంటలకు నారాయణగూడ వైఎంసీఏలోని రాజాబహదూర్ విగ్రహం వద్ద నిర్వహిస్తున్నట్లు సొసైటీ అధ్యక్షుడు టి.మోహన్‌రెడ్డి తెలిపారు. వేడుకలకు నగర పోలీస్ కమిషనర్ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి, సైబరాబాద్ పోలీస్ కమిషనర్ అవినాశ్ మహంతి హాజరుకానున్నారు.

# మహిళలకు భద్రత కల్పించాలి




లిబర్టీలోని ఇండియన్ బ్యాంకు జోనల్ కార్యాలయం వద్ద నిరసన చేస్తున్న మహిళా ఉద్యోగులు

హిమాయత్‌నగర్, ఆగస్టు 21 : మహిళలకు పని ప్రదేశంలో భద్రత కల్పించాలని అఖిల భారత బ్యాంకు ఉద్యోగుల సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి బి.ఎస్.రాంబాబు డిమాండ్ చేశారు. కోల్‌కతాలోని ప్రభుత్వ దవాఖానలో జూనియర్ వైద్యురాలిపై లైంగికదాడి, హత్యను నిరసిస్తూ బుధవారం లిబర్టీలోని ఇండియన్ బ్యాంకు జోనల్ కార్యాలయం ఆవరణంలో వివిధ బ్యాంకు మహిళా ఉద్యోగులు నిరసన కార్యక్రమం చేశారు. ఆనాడు వంటింటికే పరిమితమైన మహిళలు ఉపాధి పొందుతూ తమ జీవితాలను ఉజ్వలంగా మార్చు కుంటున్న తరుణంలో వేధింపులు, వివక్ష, లైంగిక దాడులు జరుగుతున్నాయని వాపోయారు. కోల్‌కతాలోని దవాఖానలో జరిగిన ఘటన స్థలం సెమినార్ హాల్ గోడను కూల్చివేయడం పలు అనుమానాలకు తావిస్తోందని, ఈ ఘటనపై సమగ్రమైన విచారణ చేయాలన్నారు. దవాఖానలో పని చేసే వైద్యులు, సిబ్బందికి పూర్తి భద్రత కల్పించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏపీ, తెలంగాణ బ్యాంకు ఉద్యోగుల సమాఖ్య సంయుక్త కార్యదర్శి పి.వి.కృష్ణరావు, మహిళ నేతలు మీనాక్షి, జి.పద్మ, రేఖ, మంజుల, సుప్రియ, సావిత్రి, జి.పద్మ పాల్గొన్నారు.

### వైద్యురాలి హత్యకు
## నిరసనగా ర్యాలీ

శంషాబాద్ రూరల్ : కోల్‌కతాలో వైద్యురాలి హత్యను నిరసనగా శంషాబాద్ పట్టణంలో ప్రైవేట్ పాఠశాలల ఆధ్వర్యంలో బుధవారం ర్యాలీ నిర్వహించారు. ఆర్బీ నగర్ కాలనీలోని హనుమాన్ ఆలయం వద్ద నుంచి ప్రారంభించి అంబేద్కర్ విగ్రహం ఆర్‌జీఐఏ పోలీస్‌స్టేషన్ మీదుగా తిరిగి ఆలయం వరకు నిర్వహించారు. మహిళలకు రక్షణ కల్పించాలని కేంద్ర ప్రభుత్వంతో పాటు ఆయా రాష్ట్రాల ప్రభుత్వాలు కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. తక్షణమే న్యాయం జరిగే విధంగా చొరవ చూపాలని.. నిందితులకు కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. సంబంధిత వైద్యురాలి కుటుంబానికి న్యాయం చేయాలని డియాండ్ చేశారు. కార్యక్రమంలో శంషాబాద్ పట్టణంలోని ప్రైవేట్ పాఠశాలలు ఎల్‌బీఎం, శారద విద్య మందిర్, కృష్ణవేణి ట్యాలెంట్, జ్ఞానసరస్వతి, ట్రినిటీ మోడల్ స్కూల్ విద్యార్థులు, యాజమాన్యం అసోసియేషన్ అధ్యక్షుడు బి. రాజేశ్, చైర్మన్ దేవేందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి శ్రీధర్‌రెడ్డి, కోశాధికారి నిరంజన్, చంద్రశేఖర్‌గౌడ్ పాల్గొన్నారు.




వైద్యురాలి హత్యకు నిరసనగా శంషాబాద్ పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

### అక్రమ నిర్మాణదారులపై
## చర్యలు తీసుకోవాలి



శంషాబాద్ పట్టణంలోని అక్రమ నిర్మాణాలపై కమిషనర్‌కు ఫిర్యాదు చేస్తున్న బీజేపీ నాయకులు

శంషాబాద్ రూరల్, ఆగస్టు 21 : శంషాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని అక్రమ నిర్మాణదారులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ.. బుధవారం శంషాబాద్ మున్సిపాలిటీ బీజేపీ నాయకులు నగరంలోని హైడ్రా కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. అనంతరం శంషాబాద్ మున్సిపల్ కమిషనర్‌కు వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ.. శంషాబాద్ పట్టణంలోని కాముని చెరువు అలుగుపై చేపట్టిన నిర్మాణంతో పాటు దోషికుంట కబ్జా నుంచి కాపాడాలని, సాతంరాయిలోని రామాలయం భూములను కబ్జా చేయడమే కాకుండా అక్రమంగా చేపట్టిన నిర్మాణదారులపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఫిర్యాదు పత్రాలను శంషాబాద్ మున్సిపల్ కమిషనర్ సుమన్‌రావుకు సైతం ఇచ్చిన్నట్లు వివరించారు. శంషాబాద్ మున్సిపాలిటీ పరిధిలో చెరువులు, దేవాలయ భూములతో పాటు నాలాలను కబ్జా చేసి నిర్మాణాలు చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. వినతి పత్రం అందజేసిన వారిలో బీజేపీ మున్సిపల్ అధ్యక్షుడు దేవేందర్, కొండ పరమేశ్ గౌడ్, మహిపాల్ రెడ్డి, సురేందర్ పాల్గొన్నారు.




## అభయ నిందితులను శిక్షించండి




ఖైరతాబాద్, ఆగస్టు 21 : కోల్‌కతాలో మృగాల చేతిలో బలైన అభయ కుటుంబానికి న్యాయం చేయాలని, నిందితులందరినీ గుర్తించి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ ఆలిండియా పీస్ అండ్ సోలిడారిటీ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం నెక్లెస్‌రోడ్‌లో నిరసన ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో ఆమ్ ఆద్మీ పార్టీ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్, మహిళా విభాగం నేత హేమ, వైద్యుల విభాగం నాయకురాలు డాక్టర్ లాస్య నాయుడు పాల్గొన్నారు.




## ఉన్నత శిఖరాలను అధిరోహించాలి




మహావీర్ కళాశాలలో నిర్వహించిన ఓరియంటేషన్ డే కార్యక్రమంలో మాట్లాడుతున్న కళాశాల సెక్రటరీ సంరెడ్డి సురేందర్‌రెడ్డి

మైలార్‌దేవ్‌పల్లి, ఆగస్టు 21 : విద్యార్థులు తమ లక్ష్యసాధనకు శ్రమించి ఉన్నత శిఖరాలకు చేరాలని మహావీర్ కళాశాల సెక్రటరీ సంరెడ్డి సురేందర్‌రెడ్డి అన్నారు. బుధవారం మహావీర్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ ప్రథమ సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు ఓరియంటేషన్ డే (ఆరంభ 2024 – 25) కార్యక్రమం నిర్వహించారు.

కళాశాల సెమినార్ హాల్‌లో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కళాశాల సెక్రటరీ సంరెడ్డి సురేందర్‌రెడ్డి హాజరైయ్యారు. ఆయన మాట్లాడుతూ స్వర్గీయ సంరెడ్డి సుదర్శన్‌రెడ్డి విద్యార్థులకు ఉత్తమవిద్య అందించేందుకు మూడు బ్రాంచీలతో కళాశాలను ప్రారంభించారన్నారు. 2024 వరకు కళాశాల స్వయం ప్రతిపత్తిగా ఎదిగిందన్నారు. ఉత్తమ ప్రమాణాలతో నాక్ – ఏ గ్రేడ్‌తో జేఎన్‌టీయూలో అత్యుత్తమ కళాశాలగా పేరు గాంచిందన్నారు. విద్యార్థులు మౌలిక వసతులు, లైబ్రరీని ఉపయోగించుకొని టాప్ కంపెనీల్లో ప్లేస్‌మెంట్ పొందాలని సూచించారు. అనుభవజ్ఞులైన అధ్యాపకులచే విద్యాబోధన అందిస్తున్నామని, విద్యతో పాటు క్రీడల్లో రాణించేలా శిక్షణ అందిస్తూ ప్రోత్సహిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఉషశ్రీ విద్యార్థులతో యాంటీ ర్యాగింగ్‌పై ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో హెచ్‌వోడీ డాక్టర్ మధుసూదన్, అధ్యాపకులు పాల్గొన్నారు.

## మౌలిక సదుపాయాల కల్పనకు కృషి




బాబుల్‌రెడ్డి నగర్‌లో దెబ్బతిన్న రోడ్లను పరిశీలిస్తున్న కార్పొరేటర్ శ్రీనివాస్‌రెడ్డి

మైలార్‌దేవ్‌పల్లి, ఆగస్టు 21 : మౌలిక సదుపాయాల కల్పనకు కృషిచేస్తున్నామని కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. బాబుల్‌రెడ్డినగర్‌లో బుధవారం ఆయన జీహెచ్‌ఎంసీ, జలమండలి అధికారులతో కలిసి పర్యటించారు. డ్రైనేజీ పైపులైన్, నూతన సీసీ రోడ్డు, పారిశుధ్యం, తాగునీరు, వీధిదీపాల సమస్యలను స్థానికులు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. కార్పొరేటర్ మాట్లాడుతూ.. ప్రజల సమస్యలను గుర్తించి సకాలంలో పరిష్కరించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వర్షాలకు దెబ్బతిన్న రోడ్లకు మరమ్మతులు చేయాలని, వరద నీటి నిల్వ రోడ్లపై ఉండకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో రమేశ్‌రెడ్డి, చిన్నా, గోపాల్ నాయక్, కుర్మయ్య, మధుసూదన్ రెడ్డి, జీహెచ్‌ఎంసీ వర్క్ ఇన్‌స్పెక్టర్ రాహుల్, జలమండలి సూపర్‌వైజర్ లోక్‌నాథ్ పాల్గొన్నారు.

### సెప్టెంబర్ 22న విశ్వకర్మ యజ్ఞం

విశ్వకర్మ కులస్తులలో ఐక్యతను పెంపొందించాలనే సంకల్పంతో సెప్టెంబర్ 22న ఉప్పల్ భగాయత్‌లోని విశ్వకర్మ ఆత్మగౌరవ భవనంలో శ్రీవిరాట్ విశ్వకర్మ యజ్ఞమహోత్సవం నిర్వహిస్తున్నట్లు ట్రస్ట్ చైర్మన్ లాలకోట వెంకటాచారి తెలిపారు. బుధవారం హైదర్‌గూడలోని ఎన్‌ఎస్‌ఎస్‌లో బ్రోచర్ ఆవిష్కరణ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పంచవృత్తులు చేసే వారు నిర్వహించే యజ్ఞమహోత్సవం మహోన్నతమైందని, విశ్వకర్మలు విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు రవి, ప్రశాంత్, భిక్షపతి, సూర్యప్రకాశ్, రామకృష్ణ పాల్గొన్నారు.



**- హిమాయత్ నగర్**

### అదానీ అక్రమ ఆస్తులను
## జాతీయం చేయాలి

హిమాయత్ నగర్ : అదానీ అక్రమ ఆస్తులను గుర్తించి జాతీయం చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు వి.ఎస్.బోస్ బుధవారం కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అదానీ వ్యాపార లావాదేవీలు అధిక శాతం అక్రమమే అన్నారు. 2014కు ముందు పరిశ్రమ రంగంలో అదానీ స్థానం చివర ఉండేదని, మోదీ సహకారం, అండదండలతో ప్రపంచ కుబేరుల్లో ఒకడిగా స్థానం సంపాదించుకున్నాడని తెలిపారు. అదానీ సెబీ చైర్మన్‌గా ఉన్న మాదాబీ పూరిబుచ్‌తో లాలూచి పడి లక్షల కోట్లు అక్రమ వ్యాపారం చేసినట్లుగా హిండెన్‌బర్గ్ నివేదిక బహిర్గతం చేసినప్పటికీ కేంద్రం చర్యలు తీసుకోవడం లేదని ఆరోపించారు.

### సోషల్ మీడియాను
## కట్టడి చేయాలి



ఎన్ఎస్ఎస్‌లో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న భద్ర

హిమాయత్‌నగర్ : సోషల్ మీడియాను కట్టడి చేయాలని సామాజిక వేత్తలు డాక్టర్ భద్ర, వెంకట్ నారాయణ అన్నా రు. బుధవారం హైదర్‌గూడలోని ఎన్ఎస్ఎస్‌లో మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. కొందరు అవగాహన రహితంగా వ్యవహరిస్తూ సోషల్ మీడియా వేదికగా వ్యక్తిగత ధూషణలు చేస్తూ బాధ్యతను విస్మరిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఆధ్యాత్మిక గురువు వేణుస్వామి, టీవీ న్యూస్ చానల్ న్యూస్ రీడర్ మూర్తిల వ్యక్తిగత కథలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయని ఈ అంశంపై ప్రభుత్వం విచారణ చేయాలన్నారు. దీని మూలంగా ఉభయ తెలుగు రాష్ట్రాల ప్రజలు ఉలిక్కి పడ్డారన్నారు. సమావేశంలో సామాజిక కార్యకర్తలు వరప్రసాద్, నర్సారెడ్డి పాల్గొన్నారు.

## పీజీ - స్టార్ ప్రోగ్రాంకు ఆయుర్వేద వైద్య విద్యార్థి ఎంపిక



కార్తికేయను అభినందిస్తున్న ప్రభుత్వ ఆయుర్వేద వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రమాదేవి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ యశోద

వెంగళరావునగర్, ఆగస్టు 21 : ఎర్రగడ్డలోని డాక్టర్ బి.ఆర్.కె.ఆర్. ప్రభుత్వ ఆయుర్వేద వైద్య కళాశాల ద్రవ్యగుణ విభాగం పీజీ విద్యార్థి డాక్టర్ పోలా కార్తికేయ ప్రతిష్టాత్మక పీజీ – స్టార్ ప్రోగ్రాంకు ఎంపికై రూ. లక్ష గ్రాంట్ పొందటంతో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రమాదేవి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పి.యశోద బుధవారం అభినందనలు తెలిపారు. ప్రిన్సిపాల్ రమాదేవి మాట్లాడుతూ.. ఆయుర్వేద వైద్య పరిశోధనకు నూతన మార్గాలు, ఆరోగ్యంపై సానుకూల ప్రభావం చూపేలా డాక్టర్ పోలా పరిశోధన ఉందన్నారు. డాక్టర్ ఎస్.బాబూరావు మార్గదర్శకత్వంలో కార్తికేయ చేసిన పరిశోధన అద్భుతమైనదని అభినందించారు.

ఆయుష్ మంత్రిత్వశాఖ ద్వారా సెంట్రల్ కౌన్సిల్ ఫర్ రిసెర్చ్ ఇన్ ఆయుర్వేద సైన్సెస్( సీసీఆర్ఎస్) నిర్వహించిన పీజీ – స్టార్ ( స్కీమ్ ఫర్ ట్రైనింగ్ ఇన్ ఆయుర్వేద రిసెర్చ్ )ప్రొగ్రాంకు దేశ వ్యాప్తంగా ప్రతిష్టాత్మక జాతీయ సంస్థలతో సహా 1769 దరఖాస్తులతో తెలంగాణ రాష్ట్రం నుంచి ఏకైక ప్రాజెక్టుగా కార్తికేయ పరిశోధన ఎంపికైందన్నారు. డాక్టర్ ఎస్.బాబూరావు మార్గ దర్శకత్వంలో కార్తికేయ సయాటికా వంటి నొప్పి సంబంధిత రోగాలకు శస్త్ర చికిత్స లేకుండా ఆయుర్వేద చికిత్సలను అభివృద్ధి చేయడం పై పరిశోధనలు చేశారని తెలిపారు. తమ ఆయుర్వేద వైద్య కళాశాల ద్రవ్యగుణ విభాగానికి చెందిన విద్యార్థి ఎంపిక కావడంతో పాటు పరిశోధనకు రూ.లక్ష గ్రాంట్ లభించడం గర్వంగా ఉందని ప్రిన్సిపాల్ పేర్కొన్నారు. కార్యక్రమంలో అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ నర్సింహ పాల్గొన్నారు.

### గుర్తు తెలియని మృతదేహం లభ్యం

శంషాబాద్ రూరల్, ఆగస్టు 21 : నాలాలో గుర్తు తెలియని మృతదేహం లభ్యమైన్నట్లు సీఐ బాలరాజు తెలిపారు. ఈ నెల 17న శంషాబాద్ పట్టణంలోని మధుర నగర్ కాలనీలోని వీధి నంబర్10లో ద్వారక ప్యాలెస్ బాయ్స్ హాస్టల్ వద్ద నాలాలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం పడిఉన్నట్లు సమాచారం రావడంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతదేహాన్ని నాలాలో నుంచి బయటికి తీసి పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా దవాఖానకు తరలించిన్నట్లు తెలిపారు. మృతుడి వయస్సు 35 ఏండ్ల వరకు ఉండవచ్చని, వివరాలు తెలిస్తే పోలీస్‌స్టేషన్‌ను సంప్రదించాలని కోరారు. కేసు దర్యాప్తులో ఉన్నది.



తెలంగాణ భవన్‌లోని తెలంగాణ తల్లి విగ్రహానికి క్షీరాభిషేకం చేస్తున్న ఖైరతాబాద్ నియోజకవర్గం ఇన్‌చార్జి మన్నె గోవర్ధన్ రెడ్డి, బంజారాహిల్స్ కార్పొరేటర్ మన్నె కవిత, నాయకులు

### జొమాటో బాయ్స్‌పై దాడి.. కేసు నమోదు

వెంగళరావునగర్, ఆగస్టు 21: అకారణంగా దాడులకు పాల్పడుతున్న నలుగురిపై ఎస్ఆర్ నగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. పశ్చిమ బెంగాల్‌కు చెందిన మాషుఖ్ ఆలం జొమాటోలో డెలివరీ బాయ్‌గా పనిచేస్తూ.. ఎస్ఆర్ నగర్‌లోని శ్రీ వెంకటేశ్వర బాయిస్ హాస్టల్‌లో ఉంటున్నాడు. మంగళవారం అర్ధరాత్రి 12 గంటల దాటిన తర్వాత గదికి చేరుకున్న మాషుఖ్ ఆలం తన బైక్‌ను పార్క్‌చేసి, పక్కన ఉన్న దుకాణానికి నడుచుకుంటూ వెళ్తుండగా నలుగురు స్థానిక యువకులు అడ్డగించారు. జొమాటో బాయ్ అంటూ ఎగతాళి చేశారు. అంతటితో ఆగకుండా దాడి చేసి కొట్టారు. మాషుఖ్ ఆలం ఉంటున్న గదిలో సహచరులైన జొమాటోలో పనిచేసే బీహార్‌కు చెందిన నరేశ్ కుమార్, అంకిత్ మిశ్రాలపై కూడా గతంలో ఈ విధంగానే దాడి చేసి కొట్టారు. దీంతో బాధితులు ఎస్ఆర్ నగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేయగా.. కేసు నమోదు చేసుకున్న పోలీసులు పరారీలో ఉన్న నిందితుల కోసం గాలిస్తున్నారు.

### ఓయూ పీజీ పరీక్షలు వాయిదా

ఉస్మానియా యూనివర్సిటీ, ఆగస్టు 21: ఓయూ పరిధిలోని అన్ని పీజీ పరీక్షలు వాయిదా వేస్తున్నట్లు రిజిస్ట్రార్ లక్ష్మీనారాయణ, కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ రాములు తెలిపారు. ఎమ్మెస్సీ, ఎంఏ, ఎమ్‌కాం, ఎంకామ్ (ఐఎస్), ఎంఎస్‌డబ్ల్యూ, ఎంలిబ్‌ఐఎస్సీ, ఎంజేఅండ్‌ఎంసీ కోర్సుల రెండు, నాలుగో సెమిస్టర్ రెగ్యులర్, అన్ని సెమిస్టర్ల బ్యాక్‌లాగ్, ఇంప్రూవ్‌మెంట్ పరీక్షలను వచ్చే నెల 4 నుంచి నిర్వహించనున్నట్లు ప్రకటించినప్పటికీ, యూజీసీ నెట్, టీజీ – సెట్ పరీక్షల నేపథ్యంలో వాటిని వాయిదా వేసినట్లు చెప్పారు. పరీక్షలు నిర్వహించే తేదీలను ప్రకటిస్తామని పేర్కొన్నారు.

**లా కోర్సుల రీవాల్యుయేషన్ దరఖాస్తుల గడువు పొడిగింపు**

ఓయూ పరిధిలోని వివిధ లా కోర్సుల పరీక్ష ఫలితాల రీవాల్యుయేషన్ దరఖాస్తుల గడువును పొడిగించినట్లు ప్రొఫెసర్ రాములు తెలిపారు. మూడేళ్ల ఎల్ఎల్‌బీ, మూడేళ్ల ఎల్ఎల్‌బీ ఆనర్స్ కోర్సుల ఆరో సెమిస్టర్ రెగ్యులర్, ఐదేళ్ల బీఏ ఎల్ఎల్‌బీ, ఐదేళ్ల బీబీఏ ఎల్ఎల్‌బీ, ఐదేళ్ల బీకాం, ఎల్ఎల్‌బీ కోర్సుల పదో సెమిస్టర్ రెగ్యులర్ ఫలితాలను ఇప్పటికే విడుదల చేశామని, ఫలితాలపై రీవాల్యుయేషన్‌కు దరఖాస్తు చేసుకోవాలనుకుంటే ఒక్కో పేపర్‌కు రూ.700 చొప్పున చెల్లించి 17వరకు స్వీకరించినట్లు చెప్పారు. రూ.200 అపరాధ రుసుంతో 23వ రకు స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు. వివరాలకు www. osmania. ac.inలో చూసుకోవచ్చున్నారు.

**ఎంపీఈడీ ఫలితాలు విడుదల**

ఓయూ పరిధిలోని ఎంపీఈడీ పరీక్ష ఫలితాలను విడుదల చేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు తెలిపారు. ఎంపీఈడీ రెండో సెమిస్టర్ రెగ్యులర్, మొదటి సెమిస్టర్ బ్యాక్‌లాగ్ పరీక్ష ఫలితాలను విడుదల చేసినట్లు చెప్పారు. ఫలితాలను వెబ్‌సైట్ www.osmania.ac.inలో అందుబాటులో ఉంచారు.

## ఎంజీఐటీలో వన్ డే ఆన్ క్యాంపస్ స్టడీ అబ్రాడ్ ఫెయిర్

మణికొండ, ఆగస్టు 21: మహాత్మాగాంధీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో విదేశీ విద్య అవకాశాలకు సంబంధించిన ' వన్ డే ఆన్ క్యాంపస్ స్టడీ అబ్రాడ్ ఫెయిర్ ' అనే కార్యక్రమాన్ని కెరీర్ గైడెన్స్ సెల్ ( సీజీసీ – యూజీఐటీ), గ్లోబల్ ఎడ్యుకేషన్ అండ్ కెరీర్స్ ఫోరం (జీఈసీఎఫ్) వారి ఆధ్వర్యంలో నిర్వహించారు. 25 విదేశీ విశ్వవిద్యాలయాల ప్రతినిధులు పాల్గొని బీటెక్ 5, 7వ సెమిస్టర్ విద్యార్థులకు విశ్వవిద్యాలయాల సదుపాయాలు, ప్రాముఖ్యత, ప్రవేశాలకు సంబంధించిన అంశాలను వివరించారు. కార్యక్రమంలో అమెరికా(యూఎస్ఏ), జర్మనీ, ఫ్రాన్స్, ఐర్లాండ్, కెనడా విశ్వవిద్యాలయాల ప్రతినిధులు, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.చంద్రమోహన్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.సుధాకర్‌రెడ్డి, సీజీసీ చైర్మన్ డాక్టర్ సి.ఎస్.శ్రీనివాస్, జీఈసీఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

